సీరియల్

జయాపజయాలు

"శండిల"

* గతసంచిక తరువాయి

5

అన్న మాట నిలుపుకున్నాడు అయ్యరు. వరహాలుకు ఆరు గజాల వాయిలు చీర కొని పెట్టి. సంక్రాంతి పండుక్కి మూడు రోజులు ఆటవిడుపు ఇచ్చాడు. పచ్చని వాయిలు చీరె గట్టుకుని, జాకెట్టు రవికె తొడుక్కుని వీధిన వెడుతున్న వరహాల్ని చూసి అందరికీ కళ్లుకుట్టాయి. సంఘానికెంత అసూయ! పొరుగున పొగులుతున్న వాడికి తను ఇంత పెట్టదు. పెట్టకూడదంటుంది పెరవాళ్లు. స్వతహాగా మనం సంపాదించుకు తింటూంటే గుడ్లల్లో నిప్పులోసుకుంటుంది. వసంతంలో సీతాకోక చిలుకలాగ ఆ కన్నె పడుచు రాజబాటన నడుస్తూంటే ఏక దుగ్ధే ఇరుగు పొరుగులకి. "గాదికింద పందికొక్కు గాదిలో తినే బతకాలి. పట్టినా మానినా చింతకొమ్మను బట్టాలి గాని ములగకొమ్మ ఏం లాభం? ఇటు అటు ఇక్కడ తనకెవరూ లేని ఆ అయ్యరు కుర్రాడుమాత్రం ఊరికే పెంచుతున్నాడా దీన్ని గువ్వపిట్టలాగ ఏ ఆశా లేకుండా? అది తెలుస్తుందిగా—కుమ్మరాడి పెళ్లాం పెళ్ళినాడు గాకపోయినా పెంకులు ఏరేనాడైనా కనబడదూ?" ఇంకా ఇలాంటివాటితోటే తలుపుల చాటున బుగ్గలు నొక్కుకున్నారు.

అలా గాలాగ నడిచి హోటలు ముందునుంచి మన్మథ బాణంలాగ దూసుకుపోయిన వరహాల్ని చూస్తూంటే, సంక్రాంతికి కట్టేసిన హోటలు హాల్లో పేకాడుతున్న పెద్దింటి యువకుల పేకముక్కలు తికమకగా పడుతున్నాయి చాపమీద. అయ్యరు ఆడడం లేదు. ఆమె దెసకు నిగిడ్చిన చూపులతో నిశ్చేష్టుడై పోయాడు. కనుమాపు మేర దాటింది వరహాలు. మొదట్లో కొద్ది నిమిషాలదాకా ఆనవాలు పట్టలేక పోయాడు. తర్వాత తన కళ్లు తానే నమ్మలేకపోయాడు. "నీ హోటల్లో కప్పులు కడిగేదే గాదుటయ్యా! రోజూ చూస్తున్నదేగా—అలా మతి పోగొట్టుకుంటావేం?" అని బిగ్గరగా అదలిస్తూ చౌదరీగారబ్బాయి చురుక్కు మనిపించడంతో ప్రస్తుతంలోకి వచ్చాడు అయ్యరు. చౌదరీ కుటుంబం వూళ్లో దొడ్డది. వాళ్లు పెద్దకాపులు. ఊళ్లో అందరికీ వాళ్ళంటే హడల్. పాపం! అయ్యరు కిక్కురుమనకుండా గదిలోకి జారుకున్నాడు. పట్టుబడిపోయిన దొంగలాగ బిక్క మొగమేసి మంచంమీద వాలిపోయాడు. ఇంకా హాల్లో కుర్రకారు వరహాల్ని గురించి హాస్యంగా, రసవత్తర వ్యాఖ్యానం సాగిస్తున్నారు. "మాంచి యమకంలో వుందిరా—పిల్లంటే" ఇది షావుకారు కంఠం. "రంభ రాజవీధిన రంగురంగుల కోకగట్టుకు తళుకు తళుకుమని పిస్తూ హంసనడక సాగిస్తున్నట్లు నా కళ్లు జిగేలు మంటున్నాయంటే ఇంకా—నమ్మ" చౌధరీగారి కుమారుని వర్ణన. "ఎంత పోషణ లేకపోతేనేంరా—లేత గులాబీ ఛాయ కొట్టొస్తోంది గాదూ—ఊరికే అన్నార్రా "వయసు కులుకో—బాతు కులుకో" అని ఇంకా తన్ను దిగ్భ్రమ నొందించే రసభరితవ్యాఖ్యలు సాగుతూనే ఉన్నాయి. అయ్యరుకు ఇది గుండెగాలమయ్యింది. పాతికేళ్ళ మున్య ఇలాంటి దెబ్బ తగల్లేదు. వాళ్లు వరహాల్ని వర్ణిస్తున్నకొద్దీ తనలో ఈసు పూసుకుంటోంది. తనకే గనుక సామర్థ్యం వుంటే వాళ్లందర్నీ ఆ క్షణంలో వలలాంకుడు ఉపకీచకుల్ని చేతులతో మర్దించి చంపినట్లు పచ్చడి చేసేసేవాడు. తనకే హక్కున్న ఒక అపూర్వ వస్తువుపై వాళ్లు కన్నేసినట్లు పళ్లు పిండుకున్నాడు.—'అయ్యరూ! బాగా

ఆలోచించుకో. నీకు మాత్రం ఆమెపై ఏమి హక్కున్నదోయి? డబ్బు ఇచ్చి చాకిరీ చేయించుకుంటున్నావు వరహాలు చేత. నీవు అనుకుంటున్నావు ఆమె "నా బానిస—దాసి" అని. భ్రమ. ఇది త్వరగా వదిలిపెట్టు. వదులుకోవూ—నీ వినాశనం తథ్యం—' వాళ్ళపై క్రోధం వరహాలంటే తనకున్న అవాంఛనీయమైన మక్కువకే మద్దతు నిచ్చింది.

సాయంత్రమయ్యింది. హాలు ఖాళీచేసి ఎక్కడివాళ్ళక్కడకు జారుకున్నారు. ప్రతి వొక్కడి గుండెలోను అయ్యారుకువలెనే ఆ బాణం లోతుగా గుచ్చుకుంది. లేకపోతే అందరూ మందమతులై, మొద్దువారిన మెదడులతో జాగ్రదావస్థను వీడి తమ తమ సామాన్లు అక్కడే మఱచిపోతారా? అయ్యారుకు ఒక స్పిరిట్ సిజర్లైటూ, ఒక సిగరెట్టు పెట్టి, కండువా దొరికాయి. ఔరా! పృథ్విలో యౌవ్వనంలో తన కుండే కులుకుతో, ఖుషీగా ఆడది వీధినబడి తిరగడానికి నోచుకోలేదూ? ఆవాళ అలాగ ఎందరు యువకులు ఈ జబ్బు సోకబెట్టుకు క్రుగ్గిపోయారు? నరునాటినుండి ఆ పశుచే కేంద్రంగా తమ కార్య కలాపాలు మార్చుకోవాలని ఎంత తాపత్రయపడ్డారు! అయ్యారుకు మాత్రం అసలు ఏమీ తోచటం లేదు. ఎక్కడచూచినా వరహాలే ప్రత్యక్షమౌతున్నట్లుంది. ప్రపంచమందంతటా వరహాలే అలుముకొని అతన్ని దహించివేస్తున్నట్లు మననపడుతున్నాడు.

రాత్రి పదిగంటలవేళ. "అయ్యారుగారూ" అని నిద్రపోని అయ్యారును లేపింది వరహాలు నిద్రగాని నిద్రలోంచి. వాంఛా ప్రకోపితమై అతని దేహం కాలిపోతోంది. వీధి తలుపులు తెరువబడివున్నాయి. అతి శీతల హేమంత వాయువులు అతని అనాచ్ఛాదిత దేహాన్ని పలుచని మంచుతెరల్తో కప్పాలని ఎంత ప్రయత్నించి దాన్ని తాకి అవిరి యౌతున్నాయో! వరహాలు పిలుపు మహా మధురంగా వినిపించింది. నిన్నటిదాకా ఆ మధురాతి మధురమంజుల కోమల కోయిలస్వరం ఏ చీకటికోణంలో ప్రతిధ్వనిస్తోందో! ఎదుటి పరిస్థితులు అసలు మారవు. వాటిలో మార్పులున్నా అవి అతి సహజమైన పరిణామాలు. మనసు వాటిని ఆకళింకొనే ధోరణీ, వాటిని తిలకించే రీతీ మనకుగా మనం మార్చుకొని విప్లవంకాని విప్లవాన్ని చేజేతులా సృష్టించుకుని ఆ అగ్నికి ఇంధనమైపోతాం. అయ్యారూ మనవంటివాడే.

"వరహాలూ!" బరువైన కంఠంతో పిలిచాడు. "ఏమండీ" అంటూ లోనికి నడిచింది. చీకటిగూడా ఆమె కళ్ళల్లో మెరుస్తోంది.

"ఇంత రాత్రివేళ ఇలా వచ్చావేం" తడబడే స్వరంతో అడిగాడు.

"కొంచెం పనుండి వచ్చాను."

"ఎందుకూ ?"

"మా అయ్య ప్రొద్దున్నే ఊరికెడుతున్నాడు. ఏమున్నా పదిరూపాయలుంటే అమ్మ అడిగిరమ్మంది. జీతంలో చూసుకుందురుగాని ఉంటే ఇస్తారా."

అయ్యారులో ఎంతటి ఆవేదన, ఆతురత, చంచలత, అస్థిరత్వం ఉన్నాయో ఆమెలో అంత నిర్వేదము, నిశ్చలత్వము స్థాయి కుదుర్చుకున్నాయి. అయ్యారు వణకుతూ ఆ చీకటిలోనే సుపరిచితమైన చొక్కా జేబులోని పర్సుదీసి ఒక్కటేఉన్న పది రూపాయల కాగితం ఆమె చేతిలో బెట్టాడు. వరహాలు చీకటిలోనే వేడిగాఉన్న అతని చేయి తాకి ఉలిక్కిపడినదై "జ్వరమొచ్చిందాండీ! ... పండగపూటా దీపమెట్టుకోలేదూ?" అన్నది. ఆమె ఆడే ప్రతిమాటా అతనిలో ఉష్ణాన్ని క్రమంగా దింపుతున్నాయి "ఉండండి దీపం వెలిగిస్తా"నంటూ గూటి దగ్గరకు వెళ్ళబోయే ఆమెను ఆపి "వరహాలూ! ఇలా గొచ్చి కూర్చుంటావా" అంటూ ప్రార్థనాస్వరంలో అడిగాడు. వరహాలు సందేహిస్తూనే మంచంపై ప్రక్కగా వొదిగి కూర్చుని తన చేతిని అయ్యారు గుండెలమీదవుంచి "అమ్మో! ఉష్ణం ఒళ్ళు కాలిపోతోంది." ఆమె చేతిపై తన చేతినలాగేవుంచి మృదువుగా సున్నితంగా కోమలంగా తన హృదయ స్పందనాన్ని పరీక్షించే ఆమె సన్నని మునివేళ్లను తడిమాడు. "ఆచార్యులుగారిని దీసుకురానా - అయ్యో! పండుగపూటా ఎంత కష్టమూ" అని లేచింది.

"ఫర్వాలేదు. రా—ఇలావచ్చి కూర్చో. అదే తగ్గుతుంది" అన్నాడు అయ్యారు.

ఆమె ఇంకా తన వేదనను గుర్తించలేదు. కాని ఆమె గూడా ఎంతో బాధపడుతోంది. 'అయ్యో!

తన యజమానికి జ్వరం వచ్చిందే—రేపు హోటలు నడవడం ఎలాగ ?' ఆమెకు దిగులుకూడా జనించింది.

"వరహాలూ ! ఇలా చూడు" కళ్ళు ఆమె ముఖం వైపు మళ్ళించాడు.

ఆమె కళ్లు తనులో ఉబికే కన్నీటితో అతని కళ్లను పరీక్షగా చూశాయి.

"ఒక్క మాట చెప్పనా ?"

"చెప్పండి"

"ఒద్దులే" అతని గుండె వేగంగా కొట్టుకొంది. చెప్పదలచుకొన్నది వ్యక్తం చేయడానికి సాహసం లేక పోయింది.

"సందేహించకండి. నా దగ్గిర మీకు దాపరిక మెందుకూ ?" ఆమె ఎంతటి అమాయిక ?

"మీ నాన్న ఊళ్లో ఉన్నాడా"

"ఇప్పుడేగా చెప్పాను ప్రొద్దున్నే చీకటితో పొరుగూరికి వెళ్లారని"

"ఏ వూరెళ్లారు ?"

"మరి...మరి...ఏ వూరో నాకేం తెలుసు" వరహాలు ముఖాన్ని సిగ్గు దొంతరలు క్రమ్మాయి.

"పోనీ—ఎందుకో చెబుతావా ?" ఓహో ! ఎంతటి మాటప్రశ్న ! ఆమెకు సిగ్గు ఆవహించినట్లు పసికట్టిన అయ్యారు మనస్సు కారణం కోసం ప్రాకు లాడుతూ ప్రత్యుత్తర మిచ్చే ఆ ముఖకవళికల్ని శర పరంపరలుగా చూపులతో కెలికి వేస్తోంది.

"మరి ... నాకు పెళ్ళికొడుకుని చూడ్డానికి" అంది అనలేక అనలేక చిరునవ్వుతో. అయ్యారుకు గుండె ఆగినంత పనయింది.

"అప్పుడే ఏం తొందరొచ్చిందనీ" అసందర్భపు ప్రశ్న.

"ఇప్పటికి వారం రోజుల్నుంచి మా అమ్మ అయ్య ఎముకలు నమిలేస్తోంది. "ఈడొచ్చిన పిల్ల— ఇంట్లో పెట్టుకుని ఎలా నిద్దర పడుతోంది ?" అని— అందుకని వెదకడానికి రేపు బయలుదేరుతున్నారు".

"అయితే నీకు పెళ్లి అయిపోతుందన్నమాట"

"ఆఁ — అప్పుడే ఏమయిందీ — కుదరాలి. మూడు ముళ్లూ పడాలి. అనుకోవాలి. ఇల్లు కట్టి చూడు - పెళ్లి చేసిచూడు అన్నారు"

"నా యెరికిన ఒక సంబంధం వుంది చూడమన కూడదూ మీ నాన్నను ?" వింతగా సంభాషణ మళ్లించాడు. ఆమెలో ఆశాలత చిగురించింది. కళ్లు ఆప్యాయతతో మెరిశాయి.

"దక్కని కుర్రాడు. కొద్దో గొప్పో ఉన్న వాడు. ఎంతలేదన్నా పెళ్లాన్ని పోషించుకోలేక పోడు"

"ఎక్కడున్నాడమ్మా — ఈ వూరిలోనే ?" సంతోషం పట్టలేని ప్రశ్న.

"ఆఁ-ఇక్కడే ఉన్నాడు. చెప్పమన్నావా" ? హేళనగా అన్నాడు.

"ఊఁ — చెప్పండి"

"ఉఁహూ — ఇప్పుడు గాదు. రేపు మీ నాన్నతో చెప్తాను."

"చెప్పకపోతే నా మీద ఒట్టు" బాస చేసింది వరహాలు.

"అబ్బా ! ఎంతమాట ! అయితే చెబుతాను, నిన్ను నాకిచ్చి పెళ్ళిచెయ్యమని మీ నాన్నను అడుగుతా" అన్నాడు అమాంతం లేస్తూ అయ్యారు.

వరహాలు సిగ్గుతో కళ్లుమూసుకొంది. ఆమెకు ఏమి మాట్లాడాలో తెలియలేదు.

"ఇంకముందిలాంటి పరియాచికాలాడకండి. అయ్యారుగారూ ! ఎవరేనా విన్నా నాకూ మీకూ మరియాదగాదు" కొంచెం కటువుగా అని లేవబోయింది.

"నిజం. మీకు అభ్యంతరం లేకపోతే నేను నిన్ను పెళ్లిచేసుకుంటా—ఇదిగో—చేతిలో చెయ్యి" అని ఆమె లాక్కుంటున్నా ఆగక వరహాల చేతిలో తన చేతి నుంచాడు అయ్యారు. వరహాలు తన చేతిని లాక్కోలేక పోయింది. కాదు అసత్యం. లాక్కోలేదు—ఇది నిజం. ఆమె తన చేతిని అతని చేతినుండి లాక్కోదలచుకోలేదు. అతన్ని వరహాలు విశ్వసించిందా ? ప్రేమించిందా-గౌరవించిందా—ఏదీ లేదేమో ! ఎన్నో ఏండ్లుగా స్త్రీ సహజమై తనలో ముగ్గుతూ ఈ అవకాశంతో పొటమరించే ఉన్మత్తభావం ఆమెను బంధించి వేసింది. శాశ్వతంగా ఆమె జీవనవిధిని రూపొందించింది ఆ క్షణం. అది మంచిదా ? చెడ్డదా ? అని అడక్కండి...

6

వరహాలు అయ్యారు వలలో పడిపోయింది. అతని మాటలన్నీ నిజమని పూర్తిగా నమ్మింది. అతడు తన కిచ్చిన మూడువందల రూపాయలను రెండో కంటివాళ్లెరక్కుండా దాచుకుంది. చాలా రోజుల దాకా తనకు అయ్యారుకు వున్న సంబంధం తల్లిదండ్రులకు తెలియనియ్యలేదు. జీవితంలో మిట్టపల్లాలను ఊహించగలిగే త్రాణ ఆమె కింకా కలుగలేదు. తన ప్రస్తుతపు బ్రతుకే ఆమెకు ఎంతో హాయిగా సుఖంగా వుంది. వరహాలు తన జీవితమంతటిలోనూ వర్ణింపనలవికాని కమనీయసౌఖ్యం అనుభవించిందంటే ఆ రెండుమూడు నెలల్లోనే—తర్వాత ఆమె అనుకోని భయాలు, బెంగలు, సందేహాలు ఆమెలో ఏదో అతి బలహీన స్థావరాన్ని బలాత్కారంగా లాక్కొని ఆమెను కదపడానికి ప్రయత్నిస్తున్నాయి. లోకం తననూ, అయ్యారును వింతగా చూస్తున్నందుకు కొంత అసహ్యించుకుంది. "మేం ఎలాపోతే వీళ్ళకెందుకు?" అని చీదరించుకొంది. అయ్యారు విధిగా తనను పెళ్లి చేసుకు తీరతాడు. అప్పుడేనా వీళ్ళకి బుద్ధిరాదూ? అనుకుంది. మనం అనుకొన్నవన్నీ వాస్తవంగా జరుగుతాయా? అనే సందేహంగూడా ఆమెకు కలుగకపోలేదు.

వరహాలు తండ్రి తిరిగి తిరిగి విసిగిపోయాడు; కాని తెగిన సంబంధం తేలేకపోయాడు. చివరికి ఏమీ లేనివాడు గూడా అంగీకరించకపోవటం అతని దౌర్భాగ్యం. కాళ్లు బలపాలుకట్టి కదలటం మానుకున్నాడు. "పోనీలే నాన్నా వృద్ధాప్యంలో నీకింత అవస్థ ఎందుకు? మన అదృష్టం బావుంటే పొరుగునే వుండేగూడేమో బంగారంవంటి పెళ్లికొడుకు?"—అంటూ వరహాలు ఓదారుస్తూంటే తల్లిదండ్రులు నవ్వుకొని "పేదవాళ్లంటే విధి వికృతంగా తెరచుకొన్న నోటికి ప్రథమ కబళాలు" అనుకొనేటట్లు చూసేవారు పిల్లవంక. వరహాలు మాత్రం 'యథార్థం తెలిస్తే, ఇవ్వాళ గాకున్నా రేపైనా అయ్యారు తనను పెళ్లాడితే వాళ్లు విస్తుపోరా' అని మురిసిపోయేది. నెలలు దాటుతున్నాయి. రెండు, మూడు, నాలుగు...అయ్యారు అదే ఆశను చిత్రంగా పొడిగిస్తున్నాడు—అలివిలేని ఆమె సౌందర్యమధువును తనివితీరా సేవిస్తూ.

ఆనోటా ఆనోటా గుసగుసలు బయలుదేరాయి ఊళ్లో. ఈర్ష్య, అసూయలు సంఘంలో ప్రచ్ఛన్న సంగ్రామం లేవదీశాయి. యువకుల్లో మరీ తీవ్రంగా రగుల్కొంటోంది అగ్ని. అగ్గిపుల్ల గీసి మందు ముట్టించేవాడెవడా ఈ మందుకు అని ఎదురుచూస్తున్నారు చౌదరిగారబ్బాయి, షావుకారు, గవళ్ల సుబ్రాడు ముఖ్య పాత్రధారులు ఈ నాటకంలో. అయ్యారూ, వరహాలు ఒకనాడు సరదాగా మాట్లాడుకుంటున్న సమయంలో పై ముగ్గురూ టీ గావాలంటూ వచ్చారు. మధ్యాహ్నం నాలుగు గంటలౌతుంది. కుండలు ఖాళీచేసి కప్పులు కడిగేస్తోంది వరహాలు. అయ్యారు ఆమెలో సరాగాలాడుతున్నాడు. ఆ సమయంలో "టీ గావాలంటే వినబడ్డంలేదూ?" అని ఉరుములాగ వచ్చిన చౌదరీ కంఠం వినిపించింది. "పాలు అయిపోయాయి. లేదు టీ" అని లోపలనుంచే సమాధానమిచ్చాడు అయ్యారు. అయ్యారు ప్రత్యుత్తరం రుచించలేదు చౌదరికి. "ఇలా రా" గర్జించాడు. "ఇప్పుడు తీరుబడి లేదు"

"నువ్వు రాకపోతే మేమే లోపలికి వచ్చి తీసుకొస్తాం బయటికి"

"అంత అవసరం రాలేదు"

"చూస్తావేంరా. బయటకు ఈడ్చుకురాక?" షావుకారు హుషారిచ్చాడు గవళ్ల సుబ్రాడికి. వాడు జోరుగా లోపలికి నడిచాడు. గిన్నెలు తోముతున్న వరహాలు ఇదంతా చూస్తూనే వుంది. అయ్యారు తాను అనుకోని స్వాతంత్ర్యాన్ని గవళ్లవాడు తనపై ప్రయోగిస్తూంటే ఆశ్చర్యపడ్డాడు. అతన్ని జబ్బ పట్టుకొని వీధి హాల్లోకి ఈడ్చుకొచ్చాడు వాడు. చౌదరీ కళ్లెర్రజేసి అడుగుతున్నాడు.

"ఈ వూరెందుకొచ్చినట్టయ్యా నువ్వు?"

"పొట్టకోసం"

"అలాంటి వాడివి ఎలాగుండాలో తెలీదూ?"

"ఏం—ఎలాగున్నాను?"

"పిల్లి పాలుదాగుతూ కళ్లు మూసుకుని ఎవళ్లూ చూడ్డం లేదనుకుందిట"

"అంటే మీ వుద్దేశం?"

"నాడు గాని నాడొచ్చావు తెలుసా? తిన్నగా మసులుకో— లేకపోతే తన్నులు తినగలవు"

"ఎందుకు తినాలి? నే నేం నేరంచేశానని?" వణుకుతున్నాడు అయ్యారు. చౌదరీ ఉగ్రుడయ్యాడు.

"ఏమిటీ — నేరం చెయ్యలేదూ? ఊరంతా కోడై కూస్తోంది తెలిసిందా? దాసీదైతే మాత్రం దానితో నీకు పరాశికాలేమిటీ?"

"దానితో నాకేమీ సంబంధం లేదు" దొడ్లో వున్న వరహాలు ఈ మాట వింటూ నిర్ఘాంతపడింది. 'తాను చేపట్టింది ములగకొమ్మేనా — దమ్ములేని వాడన్నమాట అయ్యారు' అనుకొని హడలిపోయింది:

"సంబంధం లేదూ? ఉన్నట్టు ఋజువైతే?" గర్జించాడు చౌదరీ.

"మీరు వేసిన గుణహా భరిస్తా"

"గుణహాట — గుణహా — మహా ఘరానామనిషనీ — సరే — ఋజువైనపుడే చెబుతాంలే — పెద్దింటి వాడవు బ్రాహ్మడవు. దానికి పట్టుమని పదహారేళ్లు లేవు. రేపోమాపో పెళ్లికావలసినపిల్ల. దాంతోనీకేమిటి - బుద్ధుండక్కర్లేదూ" కొరడా చురుకుల్లాగ చౌదరీ విసిరాడు మాటలు. అయ్యారు జవజవలాడుతూ కళ్ళు చెమ్మగిల్ల బెట్టుకుని బిత్తరగా చూశాడు.

"ఈసారి వరహాలుతో నువ్వు తిరుగుతున్నట్టయినా దానితో నీకు సంబంధం ఉన్నట్టయినా తెలిస్తే నీ వొళ్లు తొక్కదీస్తా — ఈ వూరినుంచి మకాం ఎత్తేయిస్తా. జాగ్రత్త" అని లేచాడు చౌదరీ. ఇతర మిత్రు లిద్దరూ ఘనంగా బుజా లెగరేసుకుంటూ అతని వెనకాలే నడిచారు. వాళ్లని వెళ్లనిచ్చి తలుపులు బిడాయించి దొడ్లోకి వచ్చాడు కన్నీరు రొత్తుకుంటూ అయ్యారు. అక్కడ జామిచెట్టు నానుకుని వరహాలు దుఃఖిస్తూంది.

"ఏడుస్తున్నావేం వరహాలూ?"

"నన్నంటున్నారుగాని మీకూ ఏడుపు రావడం లేదూ?" ప్రశ్నను అయ్యారులోకి చొనిపింది వరహాలు. అయ్యారుకు ఏడుపొచ్చినంత పనీ అయి వూరుకుంది.

"అంటే నీ అభిప్రాయం?"

"నిన్ను పెళ్లిచేసుకుంటానని ఎన్నాళ్లనుంచో నాతో అంటున్నారుగా — మరి వాళ్లతో అనలేక పోయారేం?" అయ్యారు కీ ప్రశ్న ఎంత అమాయకంగా తోచినా వరహాలుమాత్రం అమాయకంగా వెయ్యలేదు.

"వాళ్ళతో చెప్పుకుని ఊరేగాలా?""

"కాదు. ధైర్యంగా ఉన్నది ఒప్పుకుంటే తప్పేమిటీ?"

"వరహాలూ! నీకు బొత్తిగా ఏమీ తెలియడం లేదు—ఊరూ వాడా అనుకున్నావా మరేమన్నావా—లోకులు పలుగాకులు — మంచివాళ్లు కారు వీళ్లు."

"మంచివాళు కాదని తెలుసుకున్నప్పుడే మనం ముందు జాగ్రత్తపడాలి. మీ రాడిన అబద్ధాల్ని వాళ్లు డప్పుకొట్టి చాటుతారు. ధైర్యంగా ముందుకొచ్చి 'నేను — ఒక పేదపిల్లను, పెంచి పెద్ద చేసినదాన్ని పెళ్ళిచేసుకుంటే మీకేం —' అని అడక్కూడదూ?" ఆమె అతన్ని కడిగేస్తున్నట్టు అడిగేస్తోంది.

"చెప్పాలిట — వాళ్లు మహాన్యాయమూర్తులని"

"అన్యాయమూర్తులు గనుకనే మరీ ధైర్యంగా చెప్పాలి. మిమ్మల్ని వాళ్లేమన్నా కొరుక్కు తినేస్తారా? కాకపోయినా మీరు చేస్తున్నది దొంగతనమూ, లంజతనమూ కాదుగా —"

అయ్యారును లోలోపలికి దూసుకు తడువుకొమంటున్నాయి ఈ మాటలు. కాస్సేపు తాపీగా ఆగాడు.

"ఏం — అలా చూస్తావు?" అకోకలాగ అడిగింది వరహాలు.

"ఏమిటో నాకేమీ బాగోలేదీవేళ" అని పోయి మంచంమీద వాలాడు అయ్యారు. తన తతంగానికి ఇలాంటి వెనుపోటు వస్తుందని అయ్యారు కలలో గూడా అనుకోలేదు.

ఆవాళ రాత్రి వరహాలు చాలాసేపటివరకు అయ్యారుతో ఏమో ఘర్షణపడి ఇంటికొచ్చింది. ఆమె మనస్సులో ఆందోళ త్రాచుపాములాగ బుసకొట్టింది. అయ్యారు అస్థిరుడు, భయస్థుడు, అపనమ్మకస్థుడేమో గూడా అనే భావం ఆమెకు స్థిరమయ్యింది. అయితేనేం ఆ ఆందోళన గూడా జమచెయ్యకూడదనుకుంది. రేపటినుండి సంఘం తనపై దండయాత్రకు కత్తులు నూరుతుందని తెలియదు. "ఎండనున్నావు నీడకు రావమ్మా" అని మాటవరసకైనా తమ్ము తను కుహా

బాధల్లో ఓదార్చడానికైనా సిద్ధంగాలేని సంఘానికి ఇన్నేళ్ళయ్యాక తన ప్రసక్తి ఎందుకు రావాలి? తన సంరక్షణను ఈనాడు సంఘం ఏ దురుద్దేశ్యంతో తనకు తానే నెత్తిన పెట్టుకున్నట్టు నటిస్తోంది?" అనుకుంటోంది. కాని తనవంటి స్త్రీని కాకుల్లాగ పొడిచే స్వభావం సంఘం తనకుగా తానే పెంపొందించుకున్నదని ఆమెకేం తెలుసు?

రాత్రి రెండు ఝాములు దాటింది. మెల్లిగా తల్లి చేత తలుపు తీయించుకుని చల్లని మంచినీళ్లు త్రాగి పడుకుంది వరహాలు. ఆమెకు నిద్రబట్టడం లేదు. ఆమె మనస్సులోనూ, వంట్లోను ఏదో తిరుగుతున్నట్టుంది. తన రుగ్మతగూర్చి తల్లితో రెండుమూడుసార్లు చెప్పింది కూడా. అయితే ఆమె అతి వ్యాకులతను లోలోనే దిగ మ్రింగుకుని ఫర్వాలేదు అని చెబుతూ వచ్చింది. ఆమె కూడా చాటునా మాటునా గ్రుడ్లనీళ్లు కుక్కుకోవడం మానింది వరహాలు. బహుశా తనకు పెళ్ళి కాలేదని ఆమె బాధపడుతోంది అనుకొంది బిడ్డ. అంతేగాని అసలు సంగతి ఆమెకు తెలియదు.

ఇలా ఆలోచిస్తున్న వరహాలుకు ఎవరో ఇంట్లో దీపం ఆర్పేసినట్లు తెలిసింది. "ఎవరూ? దీపం ఆర్పేశారు?" అని అరచింది. మనస్సును ఆవరించే ఆత్రుతను ఇది ఇనుమడించింది. ఎవరో పురుష వ్యక్తి తన మీదికే వస్తున్నట్లు గుర్తించింది. భయంతో చటుక్కున కళ్లు మూసుకొంది.

వరహాలు కళ్లు తెరచేసరికి ఆమె మాట్లాడ్డానికి వీల్లేకుండా ఎదుటవ్యక్తి తన గొంతును బొమికెల ప్రాయంగా వున్న చేతివ్రేళ్లతో నులిమివేస్తున్నట్టు పసికట్టింది. గట్టిగా కేక పెడదామని ప్రయత్నించింది. లాభంలేక పోయింది. తన్ను హత్య చేయ నుంకిస్తున్న వ్యక్తి తనకు చిరపరిచితుడే. అయితే ఆమె ప్రాణం ఈలోకాన్ని, సంఘాన్ని వదలి వెళ్లడానికి అంగీకరించలేదు. కాళ్లు, చేతులు విలవిల తన్నుకుంటూ వరహాలు పెనుగులాడ్డంవల్ల దూరంగా పడుకున్న తల్లికి మెళకువ కలిగింది. "ఎవరు?" గుడ్లు నలుపుకుంటూ ప్రశ్నించింది భీతావహురాలై. "నువ్వు నోరెత్తకు!" వరహాలు తండ్రి కంఠం. ఆమెకు ఆ క్షణం వరకు ఆగంతుకుడనుకొంటున్న వ్యక్తినిగూర్చిన అనుమానం ధృవపరచింది. "వదలండి ఏమిటే మీరు చేస్తున్నది? పిల్లదాని పీక పిసుకుతున్నారా" బలంగా ఆ రెండు చేతుల్నీ విడదీసింది ఆ ముసలి. అతడు కొయ్యబారిపోయి కూర్చున్నాడు. కళ్ల వెంబడి నీళ్లు ధారగట్టాయి. ముగ్గురూ కటిక చీకటిలో మునిగి వున్నారు.

వరహాలు లేచింది. "ఆగావేం నాన్నా. కానియ్ నీపని. నీవు చెయ్యదలచుకొన్నది నే నెరుగుదును. ఊఁ—త్వరగా చంపెయ్. నీ దుగ్ధ తీరిపోతుంది." అన్నది ధీమాతో.

"ఆడేమిటే రాక్షసిలాగ అలాగంటున్నావ్? నీ కేదైనా పట్టుకుందా! రా—ఇలారా అంటూ తల్లి కూతురును దగ్గరకు తీసుకోడానికి ప్రయత్నించింది. "అమ్మా—నన్నే దెయ్యమూ పట్టుకోలేదు. నాన్న నే ఏదో ఆవహించింది. సరే—ఆయన పని పూర్తిచేసుకోనియ్.—అడ్డురాకు" అంది. "ఔను—నువ్విలాగ నీచంగా బ్రతికేకంటె చస్తేనే మేలు. నేను చెయ్యిచేసుకోకుండా నీవే ఈపాటికి ఆ పని చేసుకుని వుండవలసింది నా రోషం, పౌరుషం అంటుకోలేదు—నేను చూస్తూ ఎలాగ వూరుకోగల్ను?" ఏడుస్తూ రొప్పుతున్నాడు తండ్రి.

"సరే—నువ్వు చెప్పింది బాగానేవుంది. అయితే చచ్చి సాధించే దేమిటనే నే నిలా అనుకున్నా ననుకోగూడదూ?" వరహాలు ధీమాతో అన్నది. "సాధిస్తుందట. లోకాన్ని ఇందరు మొగాళ్లు ఏమీ చెయ్యలేకపోయారుగాని ఒక ఆడది సాధిస్తుంది."

"ఏం—ఎందుకు సాధించగూడదు? ఎందరు మొగాళ్లో చెయ్యలేనిపని ఒక్క ఆడది ఎందుకు చెయ్యగూడదు?"

"చాల్లే—నోరు ముయ్."

"అయితే—నువ్వు చంపేముందు ఒక్కటి ఆలోచించావా? లోకమే మనపై పగబూనినదనుకో. ఇప్పుడు నావొక్క రెక్కలమీద మీరు పక్షుల్లాగ బ్రతుకుతున్నారు. నేనే గనుక పోతే మీరు ఆకలితో మలమలమాడి చావవలసిందేకాని లోకం కూడు పెట్టదు మీకు. మీరు మాడి చస్తూంటే మిమ్మల్ని నిర్దాక్షిణ్యంగా చూస్తుంది. ఆఖరికి మీ శవాల్నికూడా కాకులకీ, గద్దలకీ, కనాకష్టమైన పురుగులకీ ఆహుతి చేస్తుంది. నీవు నన్ను చంపేస్తే రేపటినుంచే మీ

చావు మొదలు. ఆలోచించుకో నాన్నా" ఆమె మాట్లాడే ప్రతిమాటా ములుకుల్లా వారి హృదయాల్లో గ్రుచ్చుకుంటున్నాయి. "నిజమే. మనిషి చచ్చేదాకా తిండీ, బట్టా కావాలి. వాటి తర్వాతే ఏమైనా. అసలు తాము అన్నంకోసం పుట్టిన పురుగులు. ఆమె పోషించబట్టే ఏడాదినుంచి తనూ, భార్యా కూడా తింటున్నారు. ఇప్పుడామెపోతే తమ గతి?" ఆలోచిస్తున్నాడు.

"నాన్నా—దుఃఖించకు. నీకు పౌరుషమూ, మానాభిమానాలు తిండిపెడతాయని తోస్తే నిర్దాక్షిణ్యంగా నాపీక పిసికేసి రేపటినుండి ఆ ధర్మపన్నాల నాశ్రయించుకొని బ్రతకండి. నాకూ సంతోషమే. పోయిన తర్వాతగూడా కనీసం నీతి నియమాలకు ముగ్గురం బలిఅయ్యాం అనే తృప్తి నాకుంటుంది. ఊఁ—కానియ్" అంది. ఆమెను కావిలించుకుని కన్నీటితో తడిపేద్దామని చేతులు రెండూ చాచాడు తండ్రి. అతడు నిజంగా వరహాల్ని చంపేస్తాడేమో అని భయపడింది తల్లి. "ఆగండి. మీరు చేస్తున్నది ఎంత ఘోరమో ఆలోచించారా? ఒక నేరానికి ఇద్దర్ని శిక్షిస్తారా—వరహాలు ఇప్పుడొక్కర్తే గాదు. ఆమెలో వుండి ఇంకొక ప్రాణి ఈ మురికికుంటవంటి లోకంలోకి రావాలని తపనపడుతూ గర్భవేదన ననుభవిస్తోంది. ఏమి కానున్నదో కానీండి. పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కొందాం. ఆయువున్నన్నాళ్లూ ఎలాగో బతుకుతాంగాని చచ్చిపోముగా" అంటూ వరహాల్ని అతిప్రేమతో కౌగలించుకుంది తండ్రికన్నా ముందుగానే తల్లి. ఆ ముగ్గురూ ఒండొరుల్ని పెనవేసుకుని కన్నీళ్ళు కాల్వలుగా పారించారు.

"ఫర్వాలేదు నాన్నా—కష్టాలు వస్తుంటాయి. వచ్చాయని చచ్చిపోతామా? నీలాగే నేనూ వూహిస్తున్నాను. అయితే నీవు త్వరపడ్డావు. నేను అది మంచిదా కాదా అని తర్కించుకుంటున్నాను. కానీ—నేను కూతురును గాక కొడుకునే అయివుంటే ఇలా చేసేవాడివా నాన్నా?" ఏం ప్రశ్న ఇది! తండ్రి ఎదలో లేని చోటుచేసుకొని కుమార్తె ఎన్నడో ధైర్యం ఖాళీచేసి వెళ్లిపోయిన ఆ తావులో ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పుతోంది. అయితే ఈ చిట్టితల్లి లోకాన్ని తట్టుకు నిలువగలదా అనేదే మరొక సందేహం?

కొంతసేపయిన తర్వాత నాటి సంజవేళ చౌదరిగారబ్బాయి వచ్చాడనీ, పిల్ల నడవడిని గూర్చి జాగ్రత్త అని హెచ్చరించాడనీ, అయ్యగారు తన బిడ్డను పాడుచేస్తున్నాడనీ, మేలుకోమనీ, పెళ్లి కావలసిన పిల్ల అనీ ఇంకా ఏమేమో చెప్పాడన్నాడు తండ్రి కూతురుతో. ఎవరో తనకు తెలియకుండా తనపై కత్తి గడుతున్నారని గుర్తించింది వరహాలు. "సరే—నేనూహించినట్టే జరుగుతోంది నాన్నా. కాని దీనికోసం మీరేమీ బాధపడకండి. ఆ సంగతేదో నేను చూసుకుంటానులెండి". అని వాళ్ళకు భరవసా ఇచ్చింది, మరుక్షణంనుంచీ లోకాని కెదురీదడానికి తన భావికార్యక్రమం గూర్చి యోచించడం ప్రారంభించింది—

7

వరహాలు అయ్యరును నిలవేసింది పెళ్లి విషయమై. ఏవో సాకులు చెప్పడం మొదలు పెట్టాడు. వరహాలు ముఖుకు ఖచ్చితంగా తేల్చుకోవాలని నిశ్చయించుకుంది. తనకు నెల తిప్పిన సంగతి చెప్పేసింది. అది వింటూ హడలిపోయాడు అయ్యరు. "సరేలే—చూద్దాం" అన్నాడు. "నీకంటికెలా కన్పిస్తోందో—పెళ్లిగాని పిల్లను. పల్లెటూరు. పరిణామా లెలాగుంటాయో ఆలోచించు" అన్నది వరహాలు. "సరే—అన్నానుగా" అని మళ్లీ ప్రత్యుత్తర మిచ్చాడు బెదురుతూనే. ఆమెనుగూర్చి అతడేవో పెడఊహలు పెంచుకున్నట్లు అతని బలహీనతను వ్యక్తం చేసే మాటల్లో ఆమె పసికట్టింది. తనను పెళ్లి చేసుకోడానికి తాను అనుకున్నంత సుముఖంగా లేడనుకున్నట్లు తేలిపోయింది. ఆ ఊహను చేదుగా మ్రింగింది.

సాయంత్రం ఇల్లు చేరుకోగానే ఆమెలో ఏదో వేదన అధికమయింది. లోకం తన బలహీనతను గమనించి తన్ను వంచిస్తోంది. మరి కర్తవ్యం? ఇంతటి మోసగాళ్లపై ప్రతీకారం తీసుకోడమెలాగ? అని కాస్సేపు—తాను పొందిన అవమానానికి క్రుంగుతూ కాస్సేపు రాత్రంతా బాధపడింది. అంతులేని దుఃఖం పొందింది. దరీ అంతూలేని ఊహలతో పొగిలింది. మరునాటి నుండి తాను బ్రతికే దెట్లా? అయ్యరు తనకేదో ద్రోహం చేస్తున్నాడు. అతన్ని ఏం చేస్తే పాపం వుందీ?

మరి రెండు రోజులకు మనోవ్యాధివల్ల వరహాలుకు జ్వరం తగిలింది. జ్వరంతోనే ఆమె పనిలోకి వెళ్లింది. నలతగా వున్నదని ఆమెచేత ఏపనీ చేయించలేదు అయ్యారు. తానే వెళ్లి డాక్టరును తీసుకొచ్చి రెండు ఇంజక్షనులు చేయించాడు. మూడు మందు పొట్లాలు ఇచ్చాడు. వరహాలు అయిష్టంగానే ఆ మందు సేవించింది.

పదిరోజులపాటు కుదిపి వరహాలును చిక్కబెట్టి జ్వరం వెళ్లిపోయింది. ఆ మందు వల్లనో జ్వరం, వల్లనో ఆమెకు గర్భంపోయింది. డాక్టరు, అయ్యారు తనకు ఏదో విషం యిచ్చివుంటారని వరహాలుకు అనుమానం. రెండుమూడు సార్లు డాక్టరు ఆమెను మళ్లీ చూచి "నీవు కడుపుతో వున్నట్లు చెప్పలేదేం? సరే. ఇప్పుడేమీ ప్రమాదంలేదులే" అంటూ నీరసం నుండి తేరుకోడానికి మందు మార్చాడు. ఆమె డాక్టరును నమ్మలేదు. ఇదంతా అయ్యారే చేయించాడని స్థిరీకరించుకొంది. తనలో ఉన్న నలుసు జారిపోయినందుకు ఎంతగానో దుఃఖించింది. తాను హత్యచేసినట్లు కుంచించుకుపోయింది.

"పోనీలే తల్లీ! నీవేనా బ్రతికి బట్టకట్టావు—అదే మాకు పదివేలు" అని వాపోయింది తల్లి. పదిహేను రోజులకు వరహాలు కోలుకొంది. ఆమెకు తెలియకుండా ఏవో ఇతర రుగ్మతులు తనలో మొలకలెత్తుతున్నట్లు గమనించింది.

ఒకనాడు అయ్యారు సంగతేదో ఖచ్చితంగా తేల్చుకోవాలనుకొంది వరహాలు. "నువ్వింత పిరికివాడవని కల్లోగూడా అనుకోలేదు."

"ఏం."

"నేను నీ కంటికెంత భూతంలా గవుపడుతున్నానా—పోనీ. నాలో శిసువేం చేసింది నిన్ను?"

"అయిందేదో అయిపోయింది. దాని నిపుడెందుకు తవ్వతావు?"

"మళ్ళీ అడుగుతున్నా——నువ్వు నన్ను చంపెయ్యాలని ప్రయత్నించలేదూ? నీ కంటికంత నీచంగా కనుపిస్తున్నానా?"

"లేదు——వరహాలూ-ఊరికే అలాగ ఉక్రోశం పెంచుకుంటా వెందుకు?"

"లేకపోతే నువ్వు డాక్టరుచేత ఆ మందు నాకెందు కిప్పించావు?"

"నీగురించి కాదు. లోకం నిన్ను ఆడిపోస్తుందని బిడ్డ కరిగిపోవడానికే ఆపని చేశా."

"ఛీ—తుచ్ఛుడా—భరించే నాకు లేకపోయిందిగాని నీ బిడ్డ నీకు బరువయ్యిందా? ఇంత నీచుడవని తెలిస్తే నిన్నాశ్రయించేదాన్నిగాదు."

"వరహాలూ! నీకు తెలియక ఆవేశంలో అలాగంటున్నావుకాని నీ మేలుకోసమే చేశాను."

"ఔను—నా మేలుకోరే పెళ్ళి వాయిదా వేశావు—ఇంకా దానికోసమే పెరిగే బిడ్డను."

"లోకం గురించి నీకేమీ తెలియదు. నువ్విలాగుంటే బ్రతుకనివ్వదు. పొడుచుకు చస్తారు."

"ఓహో! ఎంత మంచి ఆలోచన! నేనంటే అంత అభిమానమేడిస్తే పెళ్ళి చేసేసుకోరాదూ? ఇంతకీ తప్పెవరిది. కలేజా లేని ఘటాన్ని బట్టుకున్నాను. అయ్యారూ! నీవు పరమ నీచుడివి. ద్రోహివి. దండాలుడవు. పిరికిపందవు. నన్ను పెళ్ళాడ్డానికి నీకు దమ్ముల్లేవు. నిజమేనా? పెళ్ళి అనేసరికి గుండెదడ పట్టుకోవడం లేదూ?" ఆమె కళ్లెర్రజేసి ప్రశ్నలు కురిపిస్తుంటే చౌదరీ అవాళ కేకలేస్తున్నప్పటికంటె ఎన్నోరెట్లు వణుకుతున్నాడు. "ఛీ—నిన్ను పెళ్లిచేసుకునేకంటె ఎందులోనైనా పడిచస్తే మేలు" అని గిరుక్కున మళ్లిపోయింది. ఇంటికి చరచర వెళ్లిపోతున్న ఆమెలో సంఘం ఎంతెటి వంచనచేసేదీ, ఎంత పిరికిదీ, దానిలో ఎంత స్వార్థం వున్నదీ, సుడిగుండాలవలె ఊహాపథంలో మెదలడం మొదలయ్యింది. అయ్యారు చేసుకుంటానన్నా వాడిని గట్టుకోడంవంటి నీచత్వం ఇంకొకటి లేదు. ఒకటిమాత్రం ఆమె నిర్ణయించుకొంది, తాను అతని దాసిగదా అని, తనకు డబ్బున్నదని, తాను మొగవాణ్ణిగదా అని అయ్యారు తనను మోసగించి, నాశనం చేసి, సమాజంలో తాను అడుగుబెట్టగూడని ఒక బురదగుంటలో కుక్కివేశాడు. ఆమె అందులో మునిగిపోయింది. దీనికి అతనిపై పగదీర్చుకోవాలని ప్రతిజ్ఞ బూనింది.

ఇంక వరహాలు తన హోటలు పనిలోకి రాదనుకొన్న అయ్యారుకు మర్నాటినుండి ఆమె యథాప్రకారం హాజరుకావడం ఎంతో ఆశ్చర్యం కలిగించింది. 'అడెది! మనసు తిరగేసుకుంది. ఏదో ఉడుకుపట్టలేక అలాగంది కాని ఆమెకు మాత్రం గడవడం

ఎలాగ? ఆమె కేకలకు నేను అనవసరంగా బెదిరిపోయాను. ఆమె ఎంతో అభిమానవంతురాలనుకున్నాను. మామూలు రకమే నేమో వరహాలు గూడా! అభిమానం వున్న పడుచైతే మళ్లీ నా గడప తొక్కుతుందా?' ఇలాగ అనేకవిధాల తనను తృప్తిపరుచుకున్నాడు. వరహాలు కలివిడిగా పనులు చేసుకుపోవడమే గాక హోటలుకు వచ్చేపోయేవాళ్లతో, తనతో, హాయిగా వేళాకోళాలాడడం చూస్తూ మరీ విస్తుపోతున్నాడు. ఈ మార్పు ఆమెలో రావడంతో హోటలుకు గిరాకీ ఎక్కువయ్యింది. కేవలం వరహాల్ని చూడ్డానికీ, ఆమె హాస్యాలు వినడానికీ, ఆమెను పలకరించడానికీ ఎందరో తపనపడుతున్నారు. వరహాలు ఇలాగయిపోయిందేమిటీ అని అప్పుడప్పుడు దిగులుపడుతూండేవాడు గూడా.

వరహాలు కిప్పుడు ఏ ఆవేదనా లేదు ఉద్రేకం అసలే లేదు. మనిషి ప్రతీకారేచ్ఛతో నిండి తత్పూర్తికై కార్యక్రమంలో లీనమైనపుడు మరో ఆలోచన అతనిలో వుండదు. అదే వెలుగు అనుకుంటూ రాత్రింబవళ్లు దానిపైనే ధ్యాస పెట్టుకున్న ఆవ్యక్తికి ఆ కటిక చీకటి, ఆ దురూహ అతి కాంతివంతంగా మెరుస్తుంది. వరహాలు—ఒక్క అయ్యారు మీద నేగాదు, పురుష జాతిమీద నే పగబూనినట్లుంది. దాని పరిణామాలను గూర్చి ఆమె యోచించలేదు. తన జీవిత విధానాన్ని తనకు తానే మారుకోవకు మళ్లించేసింది. తనను "వ్యభిచారి. విషం చెడిన స్త్రీ" అని లోకం ఆడిపోసుకున్నా లక్ష్యం చెయ్యలేదు.

కాలము మహాశక్తివంతమైనది. దాని మహాత్వ్యం ఇంతింతనరానిది. వయసులో వున్న వాళ్లందరికీ వరహాలు ఇప్పుడొక ప్రత్యేకాకర్షణ. మూకీ భావంతోనే ఆమెనుగూర్చి కోరికలు పెంచుకుంటూ తమ్ము తాము దహించుకుంటూ మనసులు పాడుచేసుకుంటున్నది ఆ వూరిలోని యువశక్తి — దీని ప్రభావం అయ్యారు మీద ఎన్నోరెట్లు పనిచేసింది. తనకు ఆమెయందు ఏదో హక్కున్నట్లు గుణించుకోసాడు. నానాటికీ వరహాలు ఒళ్లు చేసుకుంటూ మాసిన వాళ్లను కొట్టొస్తున్నట్లు సొబగులు వెదజల్లుతోంది. వాంఛలుడిగిన ముసలి వాళ్ళకు గూడా ఆ పడుచును చూస్తున్న కొద్దీ ఎన్నేళ్ళ క్రిందటనో క్రుంగి మసియైపోయిన కోరికలు తీయగా ననలెత్తుతున్నట్లయి ఉన్మత్తులయ్యేవారు.

అయ్యారు నాలుగైదు నెలలు దాటనిచ్చి వరహాలు వద్ద మొదలేశాడు. బ్రతిమాలుకోవడం, ఆశలు చూపడం, సొమ్మునివ్వడం మొదలయ్యింది. మొదట్లో అతని అవస్థకు వరహాలు జాలిపడింది. ఎంతో లాలించింది. అపని కూడదని హెచ్చరించింది. తాను మునుపటి వరహాలును గానని, తన్ను తాకితే అయ్యారు ప్రమాదం పొందుతాడనీ సూచించింది పరోక్షంగా. కాని అయ్యారు కివేవీ తలకెక్కలేదు. అతడు కళ్లుండీ గ్రుడ్డివాడై పోయాడు. చెవులుండీ చెవిటివాడయ్యాడు. వరహాలు తనకు చేసిన హితబోధలన్నీ వ్యతిరేకార్థాలనే చూపించాయి అతనికి.

స్వతహాగా వరహాలుకు అయ్యారుపైన ఎంతటి పగ వున్నప్పటికి అప్పుడప్పుడు మానవ సహజ జనితమైన కరుణ, జాలి అతని పతనాన్ని నివారించలేక పోయాయి. ఊళ్లో వాళ్లు తరచు అతన్ని హెచ్చరించినా లెఖ్ఖ చేయలేదు. తమ యిరువుర సంబంధానికి ఈర్ష్యాసూయలతో కొరకొరలాడిన పెరవాళ్ళ మందలింపులు పనిచెయ్యలేదు. ఇటు అయ్యారును, అటు ఇతరుల వ్యాఖ్యానాలను చూసి చాటుగా నవ్వుకొనేది వరహాలు. అంతేగాని ఆమె కిపుడు భయంగాని, సందేహంగాని ఇసుమంతైనా లేవు. ఒకనాడు తప్పుగా, నిందగా తనకే అనిపించిన ప్రవృత్తి నేడు తాను సంఘంపై పగతీర్చుకోవడానికి ఆయుధంగా తోచింది. అయ్యారు నెలరోజులు వరహాలుతో సుఖమయం కాని, తాను స్వర్గసౌఖ్యం అనుకొన్న దౌర్భాగ్య జీవితం అనుభవించాడు. చూస్తూ చూస్తూ మిడత మంటలను ఫలాలనుకొని చుంబించి సర్వనాశనం పొందిన బందమైంది అతని బ్రతుకు. పాతికేళ్ళు నిండని పడుచువాడికి అమాంతంగా నూరేళ్ళూ నిండిపోతున్నాయా అనే అవటుగలిగింది. ఆ ప్రహారం విద్యుదాఘాతాన్ని మించి ప్రమాదకరమైనది. అయితే దాని తీవ్రతను గుర్తించేసరికి సమయం మించిపోయింది. కొద్దిరోజుల క్రిందట జాలిగా, దయతో, సలహాగా, సూచనమాత్రంగా, హెచ్చరికగా వరహాలు తన ముందుంచిన ప్రబోధంలోని అంతర్యం అతనికి అవగాహన కొచ్చేసరికి కాలం చాలా మేర గడచిపోయింది. పరిస్థితులు తమ ప్రభావాన్ని అతనిపై బలంగా ప్రసరించాయి. మానవ ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. వైద్యులు, చిట్కాలు దమ్మిడీకి కొరగాలేదు—'చేతులారా చేసుకున్నది అనుభవిం

పక తప్పదు—కళ్లు మూసుకుపోయి కంటికావరంతో సంచరిస్తే ఏమౌతుంది' అన్నది అంతరాత్మ. వరహాలు కీతని పరిస్థితి సుంతైనా జాలిగొలుపలేదు—కాగా ఆనందం కలిగించిందేమో—ఆమె అయ్యరుహోటల్లో పని మానేసింది—లేదు అయ్యరే హోటలు వ్యాపారం మానేశాడు. ఒకనాటి వేకువజామున కాళ్ళూ చేతులూ వ్యాధివల్ల పడిపోయిన అయ్యరు రెండెడ్ల బండి గట్టించుకొని మహా మరణబాధ ననుభవిస్తూ చచ్చీ చావని దుర్భరావస్థలో ఆ వూరుకు మళ్లీ రాకూడదని నిశ్చయించుకొని తిరువనంతపురంనుండి ఎలాగొచ్చాడో అలాగే కాకుండా, చేతిలో చిల్లిగవ్వ లేకుండా ప్రయాణమై వెళ్ళిపోయాడు......

8

అయ్యరు నిష్క్రమణంతో ఆ వూరిలో వరహాలు జీవితానికి ఒక పెద్ద ప్రశ్నార్థకం కనుపించింది. అందరూ తలయెత్తి ఆ ప్రశ్నను తలకొకరీతిగా తిలకించారు. కొందరు ఆమె పరిస్థితికి జాలిపడ్డారు; కొందరు అసహ్యించుకున్నారు; మరికొందరు చిత్రంగా వ్యాఖ్యానించుకున్నారు; భయపడిన వాళ్లూ లేకపోలేదు. అయితే ఇంకొకొందరు చీకటిలో లొట్టలువేశారు—ఇదొక విశేషం. అయ్యరు ఆవూరు వదిలిపెట్టడానికి గూడా తలకొకలాగునా కారణాలు చెప్పుకొని తృప్తిపడ్డారు.

నిలవ సొమ్ములో నూరు రూపాయలు జాగ్రత్తగా ఖర్చుపెట్టుకుని వరహాలు నెలా పదిహేను రోజులు గడిపింది ఆ పేదసంసారం. తండ్రికి కూలీనాలీ చేసే ఓపికగూడా తగ్గిపోయింది. కూతురు బతుకు అతన్ని మరీ వొంగదీసింది. ఊళ్లో పదిమందిలోనూ తలెత్తుకు తిరగడానికి సిగ్గుపడేవాడు. తల్లికి గూడా బలం సన్నగిల్లిపోయింది. ఇప్పుడు ఆ కుటుంబాన్ని పోషించే భారం వరహాలుమీదనే పడింది. గ్రామంలో జరిగే మార్పుల్ని గమనిస్తూ అలాగే ఆమె బరువుగా రోజులు వెళ్ళబుచ్చుతోంది.

ఇలా వుండగా చౌదరీగారికి చాలా ఇబ్బంది వచ్చింది. భార్య నీళ్లు పోసుకొంది. ఆరో నెల. ఇంట్లో ఏ పనీ చేసుకోవడానికి ఓపిక లేదు ఆవిడకి. కోడలుకు ఒంట్లో సుస్తీచేసింది. ఊళ్లోకల్లా పెద్ద కమతం వాళ్ళది. ఇంటి పనులకు, పై పనులకు చాలా చిక్కుపడుతున్నారు. వాళ్లింటికి తరుచు మెత్తులకనీ అలుకులకనీ వరహాలు తల్లి వెళ్లుతూండేది. "పోనీ—అక్కడా-ఇక్కడా ఏమి యాతనపడతారు పెరటి సావిడిలో పడివుండి మాకింత చేసిపెట్టకూడదూ!" అని చౌదరీగారి భార్య అడగడమూ, ఆ తల్లి అంగీకరించడమూ జరిగింది. వరహాలుకు ఇది మొదట్లో నచ్చకపోయినా వాళ్ల మకాం చౌదరీగారి చావడిలోకి మార్చక తప్పలేదు. మంచిరోజు చూసుకుని ప్రవేశించారు వాళ్లింట్లో. తర్వాత తర్వాత ఇదీ బాగానే వుంది అనిపించింది వరహాలుకి.

పేరు తల్లిది—ఇంటిల్లిపాదికీ చాకిరిచెయ్యడం వరహాలుపనీగా పరిణమించింది. చేరిన మూడు నెల్లకు వాళ్లపాటు చౌదరీగారికుటుంబానికి చాలా నచ్చడం వల్ల "ఇంక మీరు ముగ్గురూ వేరే వండుకోడమెందుకు—నలుగురతో బాటు మాతో నేపడుండురూ" అని చౌదరీగారు, పెద్దవాడు, కోరడంతో మరీ వతను చిక్కింది ఆ పేదకుటుంబానికి. చౌదరీగారిభార్యకు పురుడొచ్చింది. మగబిడ్డ గలిగి పదిరోజులు బ్రతికి పోయాడు. ఆమెమాత్రం నీరసంగానే వుంటోంది. కోడలుమాత్రం మంచం వదల్లేదు.

ఇప్పుడు ఇంట్లో పని అంతా వరహాలుదే. ప్రొద్దుటనే లేవడం. దాసీవాళ్లచేత వాకిళ్లు బాగు చేయించుకోడం. పాలుదీసి పాలికాపు ఇవ్వడంతోనే కాఫీగాచి చౌదరీకీ, భార్యకు—కొడుకూ, కోడళ్ళకు ఇవ్వడం, చంటిపిల్లలకు చద్దులు బెట్టి మూతులుగడికి స్నానాలు చేయించి ముస్తాబులు చెయ్యడం, రెండుపూటలా వంటవండడం, అడపాతడపా మధ్యాహ్నం వేళ చిరుతిళ్లకు ఏపకోడీలో మినపసున్నో చెయ్యడం, పెరుగు తోడుబెట్టుకోవడం ఇదీ ఆమె దినకృత్యం. అన్నివిధాలా ఆయింట్లో అందరి మన్ననలూ పొంది వరహాలు తల్లో నాలుకయ్యింది. ముఖ్యంగా ఆమె ఆడువారి ఆదరం పొందింది. చౌదరీగారికి ప్రత్యేకాభిమానం గలిగింది ఆమె వినయవిధేయతలవల్ల. ఆ కొడుక్కి సరేసరి—రోజుకోవరసన ఆమె అతన్ని ఆకర్షిస్తూంటే బిత్తరపోయి అప్పుడప్పుడదోలాగ చూసేవాడు ఆ పడుచు వైపు.

వ్యవసాయంపనంతా కొడుకుదే. ముప్ఫయ్యేళ్లు పైగా వుంటాయి. జట్టీల్లాంటి నలుగురు పాలికాపులు,

వాళ్లలో గవళ్లకుర్రాడొకడు ఆరుకాళ్ల దుక్కిటెడ్లతో మహోధ్వజాయమానంగా కమతం సాగిస్తున్నాడు అబ్బాయి. ఊళ్ళో చౌదరీఅన్నా కొడుకన్నా హడలుతారు. పూర్వకాలంనుంచీ పెత్తనదారీ ఆకుటుంబానిదే. ఏ తగవొచ్చినా చౌదరీ తీర్పువలసిందే. ఆయన మంచికాలంలో వుండగా మురబ్బీగా, నిరంకుశంగా వుండేవాడని ఇప్పటికీ పిల్లా మేకా దగ్గరనుంచి అంతా చెప్పుకుంటారు.

వర్షాకాలం. పదిరోజులు ఏకధాటిగా కురిసి కురిసి వొరుపిచ్చింది నాలుగురోజులనుంచి. మఖకార్తె ప్రవేశించి రెండురోజులైంది. చౌదరీగారబ్బాయి ముదరగా వేయిస్తున్నాడు మిరపతోట. పదెకరాల తోటకి అరవైమంది ఆడకూలీలను, పదిమంది మగాళ్లను పెట్టి ఊడ్పిస్తున్నాడు. పొద్దున్న తొమ్మిదింటికల్లా బయలుదేరి రేవటి కెళ్లిపొయ్యాడు. అతిగాడికని మధ్యాహ్నం పంపడానికి కొంచెం మినపసున్ని, పకోడీలు చేయించింది వరహాలుచేత చౌదరీగారిభార్య. ‘వేళ దాటిపోతోంది. వస్తాన్న పాలికాపు రాలేదు— ఎలాగ?’ అని ఎదురుచూస్తోంది.

వరహాలుకు ఆవేళ తోట ఊడ్పుచూడాలని పించింది "అమ్మగారూ! నే బట్టికెళతానండి—రేవడి దగ్గరేగా — మిరపతోట చూసినట్టూ వుంటుంది, అబ్బాయిగారికి కాఫీ ఇచ్చినట్టూ వుంటుంది" అన్నది. ముందు యజమానురాలు తటపటాయించిందికాని తుదకు ఒప్పుకోక తప్పిందిగాదు. క్షణంలో చిక్కగా కాచి కాఫీ ఫ్లాస్కులో నింపింది. రెండు సున్నివుండలు, కాసిన్ని పకోడీలు పొట్లాలు గట్టింది. పెరట్లోకెళ్లి శుభ్రంగా స్నానంచేసి ఇస్త్రీ మడత వాయిలు చీరగట్టుకొని, మల్లురవికె తొడుక్కొంది. చాలారోజులతర్వాత వీధిమొహం చూస్తోందేమో బాగా ముస్తాబవాలి అనిపించింది. ముఖానికి తగు మాత్రం పౌడరు అద్దుకుని, తిలకం బెట్టుకోడానికి అబ్బాయిగారి పడకగదిలోకి వెళ్లింది. అప్పుడే ఇచ్చిన నారింజపళ్లరసం త్రాగుతున్న చౌదరీ కోడలుకు కళ్లు జిగేలుమన్నాయి. వరహాలును చూసి నిర్ఘాంత పోయింది. ఆడదైనా ఆమెకు అమాంతం వరహాలును కావిలించుకుని ముద్దుబెట్టుకోవాలి తనివిదీరా అనే ఊహ మెదిలింది. దీన్నేమీ గమనించని వరహాలు తీరుగా తిలకం దిద్దుకొని "ఎలాగున్నా వొదినా?" అంది. ఎదటి ఆమెకు అసూయ పులుముకొచ్చింది. "నిజంగా రంభలాగున్నావే—" అని మాత్రం అనగలిగింది. వరహాలు త్రుటిలో ఒకచేత కాఫీ ఫ్లాస్కు, మరొకచేత టిఫెను పొట్లాలు పుచ్చుకొని రేవడికి బయలుదేరింది. ఆమె ఇల్లువిడిచి పొలంవెళ్లిన చాలా సేపటివరకు ఆమెనుగూర్చిన ఆలోచన చౌదరీ కోడలకు పోలేదు.

వరహాలు హంస నడకన వీధినబడి వెడుతూంటే తీరికగా అరుగులమీద కూర్చుని పేకాడుతున్న పెద్దమనుషులు, వసారాలలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూనో, వైకుంఠపాళీ ఆడుతూనో, చింతపిక్కలాటలోవుండో చూసిన యిల్లాళ్లు "చౌదరిగారి ఇల్లు బట్టాక వీళ్ళ దరిద్రం వొదిలింది—తళతళలాడుతూ ఎలా వెలుగుతోందో పిల్ల" అనుకుని ముక్కుమీద వేలేసుకున్నారు. రాజవీధి దాటి, కాపుల కొంపల సందులుమళ్ళి, మాలపిల్లి దారిన తిన్నగా రేవడి చేరుకుంది వరహాలు.

పొలంనిండా జనమే. రంగురంగుల కోకలు గట్టుకుని పువ్వుల రవికెలు తొడిగి, కచ్చలు బిగించి పల్లెపడుచులు నడుంవంచి తొళ్లికతో ముందు మొగాళ్లు పొడుచుకుపోయే గుంటల్లో చేరవేసి నీళ్ళు బోసి మిరపమొక్కలు నాటుతున్నారు. నారు పెడలుబుచ్చుకుని వాళ్ళ పిరుదులవెనక, సరాగాలాడుతూ కొందరు కుర్రకారు హెచ్చరికలు చేస్తూ తోటను నడిపిస్తున్నట్లు చురుగ్గా నాటిస్తున్నారు. మధ్య జమానుగా సిల్కు చొక్కా తొడుక్కున్న అబ్బాయి చేస్తున్న అదలింపులు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. మఖకార్తె ఎండ మాడ్చేస్తున్నట్టు కాస్తోంది. రేవట్లో మూలగా ఒక్కచోట నేవుంది పెద్ద వేపచెట్టు. జుట్టు విరబోసుకున్న ఉత్తమా యిల్లాలులాగున్న ఆ చెట్టునీడన గూర్చొని ఊడ్పు అందం చూస్తోంది వరహాలు.

ఇంకొక దెసకు ఆమె దృష్టి మళ్లించింది. తీతకు వచ్చిన వేరుశెనగ చేలు, కోతకొచ్చిన బుడమచేలు వాటిమధ్య దీనంగా తలలు వొంచుకుని చిరకాల బంధువులు, మిత్రులు కొద్దిరోజుల్లోనే తమను విడిపోతున్నారే అని చింతిస్తున్నట్లు వూగిసలాడే కంద మొక్కలు, కొరకొరలాడే కొబ్బికంకెలు నేత్ర

పర్వంగా వున్నాయి. రైతుకు ఆనందమిచ్చే మహోత్తర ముహూర్తాలలో ఇదొకటి. శ్రావణమాసపు ఎండ—ఎండను వెంటాడే మేఘాలు, మేఘాల నుండి తప్పుకునే సూర్యబింబం-క్షణంలోనే భయం, అంతలోనే భరవసా—మళ్ళీ మగత—ఆకాశంలో దోబూచులాడుకుంటున్నట్లుంది. మేఘం బెడగొండలా కమ్మినపుడు చల్లని పిల్లగాలి; మళ్ళీ విడిపోయినపుడు వెచ్చని, నులివెచ్చని, గోర్వెచ్చని సూర్యకాంతి ఆమెను గిలిగింత పెడుతున్నాయి. వరహాలు మనస్సు కాస్సేపు ఆ పరిసరాల్ని వీడి ఎక్కడో ఒక మహదానంద కమనీయ మధురావస్తలో విహరిస్తున్నట్లుంది. తన ఉనికినీ, తన స్థితినీ పూర్తిగా మరచిపోయింది. ఆనందంలో తేలిపోతూ మేలుకొని వుంటూనే, కళ్లు తెరచివుంచుకొనే ఆమె ఒక వింత నిదురలో మునిగిపోయింది.

“ఏఁవిటే—వరహాలూ! ఇలా గొచ్చావు?” ఆశ్చర్యపడుతూ అబ్బాయి అడిగిన ప్రశ్నకు ఆమె ఉలిక్కిపడి లేచింది. ప్లాస్కు వేపచెట్టువార బెట్టి ఎంతసేపయిందో, ఎప్పుడు పూలకుప్పలాగ చదికిలబడిందో—ఆ చల్లగాలికి! తత్తరపాటుతో నిలచి పమిట సర్దుకుని తడబడుతూ, “ఆఁ—ఏమీ లేదు. మీకు కాఫీ అలవాటుగా—ఇవాళ నేనే తెచ్చాను” అని సిగ్గుపడి ప్రక్కకు తప్పుకొంది. అబ్బాయి ప్రత్యుత్తర మియ్యలేక గుడ్లు వప్పగించి ఆమె సౌందర్యం త్రాగేస్తూ చేష్టలుడిగిన దృక్కులలో నిలబడిపోయాడు.

వరహాలు అతని అవస్తను గమనించనట్లే నటించి ఫ్లాస్కు, టిఫిన్ పొట్లాలు తెచ్చి ముందుంచబోతూంటే “ఇక్కడొద్దు, అలాగ నీళ్ళ దగ్గిర కెడదాం రా” అని ఆమెను చాటుగా తీసుకెళ్లాడు అబ్బాయి. మెత్తని రేవడి నేల దాటి కొత్తగా వరకట్టిన మళ్ల గట్టుమీద నడుస్తున్నారు. కాలికింద నేల చితచితలాడుతోంది. ఒక చేత్తో ఫ్లాస్కు చిక్కమూ, మరొక చేత్తో పొట్లాలూ, ఎత్తిపెట్టిన చీరకొంగూ పట్టుకుని అబ్బాయి వెనుకనే మౌనంగా అడుగుల్లో అడుగులేసుకుని వెళ్లింది. మడిగట్టు మధ్యనున్న మామిడిచెట్టు కింద ఖాళీ దిబ్బమీద అతను చదికిలబడ్డాడు. ఎదురుగా ఎగువ మడిలోంచి దిగువ చెక్కలోకి గలగల పారుతోందినీరు. వీళ్లనుచూచి నీళ్లు నవ్వుతున్నట్లున్నాయి కలకలలాడుతూ. ఆమె అతనికి పొట్లాలందిచ్చి పెడగా నిలబడింది. వరహాలు ఈ మధ్యన ఎంతేనా సిగ్గూ, అభినయమూ నేర్చుకుంది. “నిలుచున్నావేఁ? కూర్చో ఇలాగ” అంటూ తనకు అడుగైనా దూరములేని ఎడం చూబెట్టాడు. పొట్లం విప్పి ఒక సున్నివుండ చిదిపాడు. తింటున్నాడు. తమ వైపు తేరిపార చూడలేక సిగ్గుతో తలలు వంచుకున్న కన్నెపడుచుల్లాగ కలకలలాడే కుర్ర వరికర్రల్ని చూస్తూ నవ్వుకుంటోంది వరహాలు. ఆ నవ్వు తిలకిస్తూ ఎటో తేలిపోతున్నాడు అబ్బాయి. “నువ్వేనా చేస్తయిది?” అడిగాడు. “ఔను—ఏం? బాగా లేదూ?” ఆమె అతని చేత బాగానే వుంది అని అనిపించుకోవాలని అలాగడిగింది అంతే.

“బాగా లేకపోవడమా? ఎంత తియ్యగా ఉందో”

“మనమిలా వచ్చేశాం — కూలీలు వొళ్లు దాచుకోరూ?”

“వెధవగొడవపోనిద్దూ. నీకు బాగా వుంటోందా మా ఇంట్లో?”

“నాకేం—నిక్షేపం లాగుంటోంది”—అతడు క్రమంగా ఉన్మత్తుడౌతున్నాడని ఆమె పసికట్టింది.

“అయ్యో! నీవు తినలేదే — చూశావా మందమతి” అంటూ ఆమె అనుమతికైనా ఆగకుండా చొరాయించి తానే స్వయంగా రెండోవుండ ఆమె నోటకుక్కాడు. వ్యవహారం ఇంత త్వరలో ఇలాగ ప్రతిమించుతుందనుకోలేదు వరహాలు. తానూ వరిచేలూ, చెట్ల పరిసరాలు చూస్తూ ఏమరుపాటున వుంది. వెంటనే పళ్లు గిటకరించింది. అతని వేళ్లు రెండు నలిగిపోయాయి ఆమె పంటిసందునబడి. మిగతా వుండ చిదికి గుండ ఆమె గుండెలమీదనుండి క్రిందికు దిగజారి చీర నిండా రాలింది.

“అబ్బ! నువ్వు కరచినా ఎంతో తియ్యగా వుంది సుమా” అంటూ అబ్బాయి ఆమెకు మరికాస్త దగ్గరగా జరిగాడు. మెడనుండి పాదాలదాకా పడిన గుండను వెంటనే దులిపి తుడిచేశాడు అతడు. అతని స్పర్శలో, ఆసంజవేళను, చల్లగాలిలో ఆమె ప్రతి అవయవమూ పులకరించింది. ఇంక ఎంతమాత్రం అశ్రద్ధ చెయ్యకూడదు. సమయ మిప్పటికే మించి

పోయింది. వరహాలు త్రాచుబుసను మరపించే వేడి నిట్టూర్పులతో ప్రక్కకు వొత్తిగిలింది.

"అబ్బాయిగారూ! కొంచెం వొళ్లు దగ్గిరపెట్టు కోండి. అంతకంతకు మీరేం చేస్తున్నారో మీకే తెలియని అవస్థలోకి దిగజారిపోతున్నారు. లేవండి. కళ్ళు తెరవండి."

"వరహాలూ! నేను తెలిసే చేస్తున్నా నీపని"

"అయితే—దీని ఫలితం అనుభవించడానికి సిద్ధంగానే ఉన్నారా?"

"ఆఁ—స్వయంగా"

"మంచిది కాదు సుమండీ మీవంటి వారికి. లోకంలో ఎంతోమందికి సబబులు చెబుతున్న పెద్దయింటి పెద్ద కొడుకులు మీరు"

"అయితే?"

"ఇట్లాంటి పనులవల్ల మీకేగాక, మీ యింటికీ, కుటుంబానికీ గూడా చెడ్డపేరు వస్తుంది.

"నువ్వు నాకేమీ నీతులు నేర్పక్కరలేదు" ఎంతో అహంకారం ప్రకటించాడు.

"ఇవి నీతులు కావు—తర్వాత మీరే అనుభవిస్తారు—సరే"

"వరహాలూ! ఈ వూళ్ళో ఎవరూ ఈ చాదరీని తప్పించుకొని పోలేరు. తలచుకుంటే ఎంతవాళ్ళనైనా సరే నల్లిని నలిపినట్లు నలిపెయ్యగల్ను" అహంభావం అంధకారాన్ని పులిమింది అబ్బాయిలో.

"నేనూ చెయ్యగలను ఆ పని. ఆపదాన్ని అనుకుంటున్నారేమో" వరహాలు అన్నమాట మాత్రం నిజం. ఆమె తలుచుకుంటే ఎంతైనాచేసి తీరుతుంది ఆడదీ, అందకత్తె గనుక.

"నన్ను ముట్టకండి. నేను అగ్గిలాంటిదాన్ని. మేం పెంచి పోషిస్తున్నామని మీరు హద్దుమీరి చరించడం మర్యాదగాదు. దీని విషఫలితాలను గుర్తించి కళ్లు తెరవండి."

"ఏం పతివ్రతండీ! బయులుదేరింది ఇన్నాళ్లకు ఈ పాటిమీద? పతిలేని పతివ్రత" హేళనగా నవ్వాడు. ఈ మాటలవల్ల ఆమె అభిమానం గాయపడింది. వెంటనే రూపుమార్చింది.

"ఇది మానుకోరన్నమాట! సరే" దీనవదనయై దిగజారిన ఆమెను చేరదీసి "వరహాలూ! నామీద నీకెందుకూ ఇంత కోపం? అయ్యారుపాటి చెయ్యనూ నేను?" అన్నాడు నవ్వుతూ. అతడు సరియైన ఉజ్జీ తనకు అనుకున్న ఆ మగువ "వెధవ గొడవ—దీనికేం గాని కాఫీ త్రాగండి" అసలు జరిగినదాన్ని పట్టించుకున్నట్టే తోచనట్టు విసిరేసింది చివరి చురుకు. అతడు టిఫెనూ, కాఫీ పూర్తిచేసుకుని కాళ్లు, చేతులు కడుక్కోవడానికి కందకం దగ్గరగా వంగాడు—అప్రయత్నంగా కాలు కందకంలోకి జారుకుంది. తెల్లపంచె, సిల్కు లాల్చీ బురదమయమయ్యాయి. మామిడిచెట్టు నానుకుని ఆతని ముష్కరత్వానికి కూడా సానుభూతి చూపుతున్న పడుచు కొంగునోట కుక్కుకుని ముసిముసిగా నవ్వుతోంది. అబ్బాయి నెమ్మదిగా లేచి కాళ్లకంటిన బురద తాపీగా కడుక్కుని మడతమార్చి పంచె బొడ్లో దోపుకుని పొలానికి బయలుదేరాడు. 'అడుసు దొక్కనేల? కాలు కడుగనేల?' అనుకొని ఒక కుపితచాలనం అవమానంతో అరుణత్వం నింపుకున్న అతని కళ్లమీదికి విసిరి నవ్వుతూ నడిచింది వరహాలు. తననొక కీలుబొమ్మనుచేసి ఆపిల్ల ఆడించడానికి ఉబలాట పడుతున్నట్టు తోచింది అతనికి. "సరేలే — ఇప్పుడుగాదు—నీపని ఈసారి చెబుతా" అన్నట్లు చూసి ఉక్రోశంతో పెద్ద అంగ లేసుకుంటూ పొలంలో పడ్డాడు అబ్బాయి.

"ఇదిగో! ఆ గవళ్లకుర్రాడు చూడండి. చింతపిక్కలాగ నున్నని కండలు మెలిదిరిగిన జబ్బలూ, వాటిపై తాయెత్తులు వాడూను. మనం పొలంగట్టుమీద కూర్చున్నప్పటినుంచి ఏక వెగ్రెత్తినట్టు ఎలా చూస్తున్నాడో పనిమాని." అని వాణ్ణి అబ్బాయికి చూపించింది వరహాలు. మనిషి ఒక వింతజంతువు. వయసులోవున్న యువతీయువకులు ఒక జంటగా ఏకాంతంలోవుండి ఏదైనా మాట్లాడుకుంటూవుంటే మతిపోగొట్టుకుని చూస్తాడు. ఎందుకో? ఏమిటో ఆకలి??

అబ్బాయి అవమానంవల్ల తనకు వరహాలుమీద కలిగిన క్రోధాన్నంతటినీ గవళ్ల కుర్రాడిమీదికి మళ్లించాడు. వాడూ మొగాడే. వయసుకాడు. తుమ్మదుక్కలాంటి కుర్రాడు. వాడి దప్పిక ముందు

వచ్చే అబ్బాయివంకగూడా చూడనివ్వక వెనకాల వచ్చే వరహాలుమీద నే ఉంచనిచ్చేసింది వాడికళ్లను. ఆచిన్నది తక్క ఇంకేమీ కనపడడంలేదు. అబ్బాయి యెదుటికొచ్చి సాగదీసి ఒక్క లెంపకాయ కొట్టాడు. దానితో వాడు తెప్పరిల్లి తెలివికొచ్చాడు.

"అదేఁవిటే—వాణ్ణాలా కొడతారేం. మీకేమన్నా మతిపోయిందా?"

"ఉండు వరహాలూ! నీకేమీ తెలీదు. రూపాయి కూలిపుచ్చుకుని పనిమాని దిక్కుదిక్కులు చూస్తున్నాడు వెధవ!" అని మళ్లీ లాగి రెండు కొట్టాడు దవడమీద.

"ఆగండబ్బాయిగారూ! ఇంక చెయ్యిమిగిల్తే మర్యాదుండదు. చౌదరీగారికొడుకు ననుకుంటుండావేమో" అని వొళ్లు తడుముకుని పనిలోనికి పోయాడు వాడు. చౌదరీ కొట్టడంకంటె దాన్ని వరహాలు చూడ్డం వాణ్ణి మరీ కాల్చివేసింది అవమానంతో.

వెనుదిరగడంలో వాడు అగుపరచిన విరుపులో వేయి పడగల బుస ఇరుక్కున్నట్లు కనుపించింది.

'అసలుమనిషి ఎలా పుట్టాడంటావూ? వాడు భూమిమీద పడకుండానే, తల్లిగర్భంలో తయారౌతున్న క్షణాలలోనే వాడి శరీరకణాలలో నూటికి తొంభైతొమ్మిదింటిని స్వార్థం ఆవహించి అవే తానైపోయి వుంటుంది. లేకపోతే అబ్బాయిని చూడూ! తను చూసినపిల్లను—ఆమెయైనా సవ్యమైనది గనుకా! తనకు తెలియని విషవాపి—దాన్ని ఇంకొకడు కామేచ్ఛతోగాకపోతే కనీసం కంటి వేడుకతీరడానికైనా చూడగూడదూ? ఎంతటిఈర్ష్య? తనవస్తువు, తనఆశ, తనవాంఛ, తన స్త్రీ అంతా తనదన్నదాన్ని తనలా ఇంకొకడు చూడగూడదు. చూస్తే ఇంకేముంది? బాధ, ఏడ్పు, రోషం, దుఃఖం, యుద్ధం, అశాంతి ఇంకా ఎన్ని మహాఘోరాలున్నాయో అన్నిని—' ఇలా ఊహించుకొంటూ ఇంక అక్కడ క్షణంసేపైనా ఆగలేక ఇంటికొచ్చేసింది వరహాలు...

సశేషం